క్లుప్తంగా

ముద్రగడను హింసించినప్పుడు పవన్ ఏమయ్యాడు?


కావలి నాని

నరసాపురం: స్కిల్ డెవలెప్‌మెంట్ స్కామ్‌లో అరెస్టయిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విషయంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అల్లాడిపోయిన విధానం బాగాలేదని నరసాపురం కాపు సంఘం నేత కావలి నాని విమర్శించారు. చంద్రబాబుకు మద్దతుగా పవన్ విజయవాడ వెళ్లే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ హయాంలో కాపు సంఘ నేత ముద్రగడ పద్మనాభంను అరెస్ట్ చేసినప్పుడు పవన్ ఎందుకు ఇంతలా స్పందించలేదని ప్రశ్నించారు. ముద్రగడ పద్మనాభాన్ని దారుణంగా హింసించి, ఆయన కుటుంబాన్ని కూడా అవమానపర్చినప్పుడు పవన్ కనీసం మాట్లాడలేదన్నారు. చంద్రబాబు అంశంలో పవన్ కల్యాణ్ ఓ జనసేన అధినేతగా కాకుండా ఓ టీడీపీ నాయకుడిగా వ్యవహవరించిన తీరు చూసిన జనసైనికులు కూడా ముక్కున వేలేసుకుంటున్నారని అన్నారు.

బీచ్‌లో సందర్శకుల రద్దీ


కేపీ పాలెం బీచ్‌లో సేద తీరుతున్న సందర్శకులు

మొగల్తూరు: కేపీపాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం కొద్దిపాటి వర్షం పడినా మధ్యాహ్నం నుంచి ఎండతో పాటు ఉక్కబోతగా ఉండటంతో పర్యాటకులు సముద్ర స్నానం చేస్తూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం తీరంలోని వేంకటేశ్వరస్వామి, వేళాంకణి మాత, పాండరంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల కిటకిట


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రాకతో క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

డ్రెయిన్ శిథిలం

నరసాపురం: పట్టణంలోని పాత రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో ఉన్న డ్రెయిన్ శిథిలమైంది. మురుగు పారక పోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ డ్రెయిన్‌ను పునర్నిర్మించాల్సిన అవసరముందని స్థానికులు అంటున్నారు. అయితే మునిసిపల్ అధికారులు ఈ అంశంపై దృష్టి పెట్టకడం లేదని మండిపడుతున్నారు. స్థానిక రాజరాజేశ్వరి థియేటర్ వద్ద నుంచి ఈ డ్రెయిన్‌ను ఆనుకుని పెద్ద సంఖ్యలో ఇళ్లు ఉన్నాయి. ఈ ఇళ్లకు సంబంధించిన వాడకపు నీరంతా ఈ డ్రెయిన్ గుండానే వెళ్లాలి. ఈ డ్రెయిన్ రూరల్ పోలీస్ స్టేషన్ అవతల కొద్ది దూరంలో మెయిన్ డ్రెయిన్‌లో కలుస్తుంది. ప్రస్తుతం డ్రెయిన్ శిథిలం కావడంతో మురుగు సవ్యంగా పారడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పక్కా డ్రెయిన్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: సమస్యల పరిష్కారం కోసం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో వై.శ్రీనివాస్ చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ ఫిర్యాదులు, విజ్ఞప్తులు అందించాలని కోరారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


క్షీరారామలింగేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకి విరాళం అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పట్టణానికి చెందిన వేగి కనకరత్నం తన భర్త శివరామకృష్ణ జ్ఞాపకార్థం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకి రూ.10వేలు విరాళం సోమవారం అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణలకు అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

సంక్షేమ పథకాల రథసారథిని ఆశీర్వదించాలి

గుడాల శ్రీహరి గోపాలరావు


దొడ్డిపట్లలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న సంక్షేమ పథకాల రథసారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా మరొకసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. మండలంలోని దొడ్డిపట్ల గ్రామంలో వరుసగా రెండవ రోజు ఆదివారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి అమ్మా మమ్మల్ని జగనన్న పంపించారు..ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మీకు సక్రమంగా అందుతున్నాయా..?మీ వలంటీర్ సేవలు బాగా అందిస్తున్నారా..?ఈ ప్రభుత్వంలో అధికారుల పనితీరు ఎలా ఉంది..?అంటూ అందరినీ అడిగారు. అనంతరం గోపి మాట్లాడుతూ జగనన్న ప్రతినిధులుగా ఏ ఇంటికి వెళ్లిన ప్రజలు చక్కని చిరు నవ్వుతో మమ్మలి స్వాగతిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ నవరత్నాల్లో కనీసం రెండు మూడు పథకాలు మాకు లభించాయని ఆనందంతో చెబుతున్నారన్నారు. సాంకేతిక లోపాలు కారణంగా ప్రభుత్వ పథకాలు కొన్ని అందకపోతే వాటిని తెలుసుకుని అక్కడే పరిష్కరించడానికి అధికారులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులను చేసినట్లు ఆయన వివరించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా చేసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్న జగనన్నకు ప్రజల అండదండలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు యడ్ల తాతాజీ, సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓదూరి శ్రీనివాసరావు సర్పంచ్ చెల్లుబోయిన ప్రమీల కుమారి, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు నాయకులు బోనం బులివెంన్న, ఉచ్చుల స్టాలిన్, కల్యాణం గంగాధరరావు, కానూరి కృష్ణారావు, శిరగం శ్రీనివాస్, కోళ్ల వెంకటేశ్వరరావు, శీలం వీరబాబు, పొన్నమండ ముత్యాలరావు, లంక చిరంజీవి, మైలాబత్తుల మైకేల్‌రాజు, మామిడిశెట్టి పెద్దిరాజు, బొక్కా సురేష్, మందా హరికుమార్, ముప్పిడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబు అవినీతి బట్టబయలు


వెలగల వెంకటరమణ

పెనుగొండ: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అవినీతి బయట పడిందని, సాక్ష్యాధారాలు ఉన్నందునే కోర్టు రిమాండ్ విధించిందని పెనుగొండ ఏఎంసీ చైర్మన్ వెలగల వెంకట రమణ(మిస్సీ) అన్నారు. ఆదివారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ ఏసీబీ కోర్టు తీర్పుపై స్పందించారు. అవినీతి ప్రజల కళ్లకు కనిపిస్తున్నా చంద్రబాబు నేను నిప్పు అని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. కోట్ల రూపాయల ఫీజుతో లాయర్లను తెచ్చుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. నిప్పులా బయట వస్తారంటూ టీడీపీ నాయకులు నానా హంగామా చేసి ఢీలా పడ్డారన్నారు. ఈ తీర్పుతో స్వర్గీయ ఎన్టీఆర్ ఆత్మ సైతం శాంతిస్తుందన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


ఉచిత వైద్యశిబిరంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పోడూరు: నేటి సమాజంలో అందరూ ఒత్తిడితో కూడిన జీవితాన్ని ఎదుర్కొంటున్నారనీ, దీనివల్ల చిన్న వయస్సులోనే అనారోగ్య సమస్యలు వస్తున్నాయనీ, కాబట్టి ప్రతిఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) పాస్ట్ జోనల్ ప్రెసిడెంట్ రాహుల్ వేదాంతం పిలుపునిచ్చారు. జేసీఐ పాలకొల్లు రైసింగ్ ఆధ్వర్యంలో ఆదివారం జిన్నూరు ఐడియల్ స్కూల్ ప్రాంగణంలో మహిళలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పాస్ట్ జోనల్ ప్రెసిడెంట్ రాహుల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేద, సామాన్య ప్రజలకు తగిన వైద్యసేవలు అందించే లక్ష్యంతో తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మెగా శిబిరంలో ప్రసూతి, చెవి, ముక్కు, గొంతు, దంత, చర్మ సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసి ఆరోగ్య సూచనలు చెప్పారు. రోగులకు దంత వైద్య నిపుణురాలు డాక్టర్ మౌని కావలి, హెడ్ అండ్ నెక్ జర్జన్ డాక్టర్ జయదుర్గాదేవి రుద్రరాజు, ప్రసూతి వైద్యనిపుణురాలు డాక్టర్ ఉమాదేవి కావలి, స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ సుభాషిణి జక్కంపూడి, డాక్టర్ ప్రశాంతి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ జోనల్ వైస్ ప్రెసిడెంట్ మీనా మణిదీప్తి, ట్రెజరర్ సబిత, సభ్యులు కౌసిక్, శిరీష, నీలిమ, ప్రదీప్, విష్ణు, మురళీ కృష్ణ, సుందరి, తరుణ్‌సాయి, ఆచంట వెంకట సుబ్బారావు, వి.సదాశివమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బడుగులు రాజ్యాధికారం సాధించాలి


పెనుమదంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు

పోడూరు: బడుగు, బహుజన వర్గాలు రాజ్యాధికారం దిశగా పయనించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ గణేష్ భవాని పిలుపునిచ్చారు. పెనుమదంలో ఆదివారం మండలస్థాయిలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. నియోజకవర్గ అధ్యక్షుడు పితాని చిన్న సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముద్దాడ గణేష్‌భవాని మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్ల గడిచినా బడుగు, బహుజన వర్గాల్లో ఆశించిన మార్పు రాలేదన్నారు. అగ్రకుల రాజకీయ పార్టీలు బడుగు, బహుజన వర్గాలను అభివృద్ధికి దూరం చేస్తున్నాయని విమర్శించారు. చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలనీ, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలనీ, కులాలవారీగా జనభాగణన జరగాలని గణేష్ భవాని డిమాండ్ చేశారు. సమావేశంలో ముందుగా చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి గణేష్‌భవాని, పితాని చిన్న తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పలువురి నియామకం..

జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పితాని వెంకట్‌ను, నరసాపురం డివిజన్ అధ్యక్షుడిగా గుబ్బల సత్యనారాయణను, పాలకొల్లు నియోజకవర్గ ప్రచారకమిటీ అధ్యక్షుడిగా చింతపల్లి చరణ్‌ను, పోడూరు మండల యువజన విభాగం అధ్యక్షుడిగా గుత్తుల వెంకట నాగరాజును, సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కాండ్రేకుల మణికంఠను, నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా దంపనబోయిన సాయికుమార్‌ను, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా గుబ్బల ఉదయభాస్కర్‌ను, పోడూరు మండల కార్యదర్శిగా జుత్తుగ దేవేందర్‌గౌడ్‌ను నియమిస్తున్నట్లు గణేష్‌భవాని సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, మామిడి సత్యనారాయణ, వింజరపు శంకరం, దప్పిడి నరసింహరాజు, కందికట్ల పరబ్రహ్మం, బీసీ నాయకులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక


మొగల్తూరు ఉన్నత పాఠశాల 1971-72 బ్యాచ్ పదో విద్యార్థులు

మొగల్తూరు: స్థానిక పెన్మెత్స రంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1971–72 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. సుమారు 52 సంవత్సరాల అనంతరం అప్పటి స్నేహితులంతా కలుసుకోవడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాలలో స్థిరపడిన స్నేహితులు తమ కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. స్నేహితులంతా అనాటి ముచ్చట్లను నెమరవేసుకుంటూ అప్పుడు విద్యనందించిన ఉపాధ్యాయులు కొద్ది మంది మాత్రమే అందుబాటులో ఉండటంతో వారిని ఘనంగా సన్మానించారు.

చంద్రబాబు పతనం ఖాయం


మేకా శేషుబాబు

పాలకొల్లు అర్బన్: స్కిల్ డవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబుకి న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో రాజకీయ పతనం ప్రారంభమైందని టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు రాజకీయ జీవితం నేర పూరితమైందని పేర్కొన్నారు. స్కిల్ డవలప్‌మెంట్ స్కామ్‌లో కోర్టుని తప్పుదారి పట్టించాలని శతవిధాలా ప్రయత్నించి విఫలమయ్యారని విమర్శించారు.

నేడు పాలకొల్లు మండలపరిషత్ సర్వసభ్య సమావేశం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు విధిగా పాల్గొనాలని ఆయన కోరారు.

న్యాయ వ్యవస్థపై నమ్మకం వచ్చింది


గమిడి మధుబాబు

నరసాపురం రూరల్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబులో అరెస్టుతో న్యాయవ్యవస్థ మీద నమ్మకం వచ్చిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి సంఘం నేత గమిడి మధు బాబు అన్నారు. మంచి జరిగితే తమదని, చెడు జరిగితే ఎదుటివారిదనే ఆలోచనలను, సంస్కృతిని విడనాడాలని తప్పు, నేరం ఎవరు చేసినా ఒకటేనని ఆయన అన్నారు. చంద్రబాబు అరెస్టు చారిత్రాత్మకమని, ఈ రోజు సెప్టెంబర్ 10ను గోల్డెన్ డే గా ఆయన అభివర్ణించారు.

తూర్పుతాళ్లులో అన్నసమారాధన

నరసాపురం రూరల్: మండలంలోని తూర్పుతాళ్లు పరిధిలోని పెదతోటలో కొలువై ఉన్న శ్రీ కృష్ణుని ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకల ముగింపు సందర్భంగా ఆదివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల వంటకాలతో చేసిన పసందైన భోజనాన్ని భక్తులకు వడ్డించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోగి చికిత్సకు సాయం


జీసస్ హోప్ ఛారిటీ విరాళాన్ని రోగికి అందజేస్తున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: పేదలకు సహాయం చేయడంలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. ఆదివారం ఆయన గృహంలో దొండపేటకు చెందిన తాడి నవీన్ మోటార్ సైకిల్ నుంచి పడిపోవడంతో ముక్కుకి తీవ్రగాయాలు కావడంతో శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. పేదరికంతో బాధపడుతున్న నవీన్‌కు జీసస్ హోప్ ఛారిటీ (కువైట్–ఇండియా) రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని ఆనందప్రకాష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జీసస్ హోప్ ఛారిటీ సభ్యులు జాలెం శ్రీను, నక్కా సాగర్, పాస్టర్ మెతు సలా, యాళంగి శేషగిరిరావు, నక్కా ఇర్మియారాజు పాల్గొన్నారు.

చంద్రబాబుకి రిమాండ్‌పై హర్షం..

స్కిల్ డవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబుకి న్యాయమూర్తి రిమాండ్ విధించడంపై రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ స్కామ్ నుంచి బయటపడడానికి చంద్రబాబు చాలా ప్రయత్నం చేశారని, న్యూఢిల్లీ నుంచి లాయర్లను రప్పించుకున్నారని అయినా చంద్రబాబుకి ఫలితం దక్కలేదన్నారు. తప్పు చేసినవారు ఎంతటివారైనా చట్టం ముందు తలవంచాల్సిందేనన్నారు.

ఎన్టీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

పెనుగొండ: 40 ఏళ్లుగా స్టేలు తెచ్చుకొని పబ్బం గడుపుతున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇకపై స్టేలు తెచ్చుకునే సీజన్ పోయిందని, నేడు స్వర్గీయ ఎన్టీ రామారావు ఆత్మ శాంతించిన రోజుఅని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. చంద్రబాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధిస్తూ తీర్పు ఇవ్వడంతో ఆచంట మండలం కొడమంచిలిలో ఎన్టీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. చంద్రబాబు పాపం పండడంతో కోర్టులో చుక్కెదురైందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు యల్లమెల్లి బేబీ రాజేష్, రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, మండల యూత్ అధ్యక్షుడు పిల్లి రుద్ర ప్రసాద్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండేటి రమేష్, సేవాదళ్ మండల కన్వీనరు ఇంజేటి సుగుణరాజు, ఏఎంసీ డైరెక్టరు కొండేటి భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆకివీడులో లయన్స్ శాశ్వత సేవలు అమోఘం

ఆకివీడు: ఆకివీడు లయన్స్ క్లబ్ శాశ్వత సేవలు అమోఘమని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ చెప్పారు. స్థానిక లయన్స్ ఆదర్శ క్లబ్ ఆధ్వర్యంలో మోటుపల్లి రత్తయ్య, సూర్యావతి ఆనంద నిలయం(వృద్ధాశ్రమం) భవన నిర్మాణానికి ఆదివారం భూమి పూజా కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఆకివీడులోని లయన్స్ క్లబ్‌లు శాశ్వత, క్యాలెండర్ సేవల్ని అందజేయడంలో ముందంజలో ఉందని చెప్పారు. అన్ని విధాలుగా లయన్స్ ద్వారా సేవలందుకుంటున్న ఈ ప్రాంత ప్రజలు అదృష్టవంతులని చెప్పారు. ఈ సందర్భంగా లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు లయన్స్ సేవలను వివరించారు.

సూర్యప్రభకు పరామర్శ


మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభను పరామర్శిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ తల్లి అడబాల శేషవేణి వయోభారంతో శనివారం మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆదివారం మేడపాడు వచ్చి సూర్యప్రభను, ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతురాలు శేషవేణి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు. ఆమె కుమారుడు అడబాల రామ్మోహనరావు సచివాలయ కన్వీనర్‌గా ఉన్నారు. శేషవేణి మరణానికి గోపి సంతాపం తెలిపారు. గోపి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఓదూరి భాస్కరరావు, బోనం బులివెంకన్న, చివటపు నాగేశ్వరరావు, గంధం సత్యకీర్తి, వర్ధనపు వెంకటేశ్వరరావు, ఉండ్రాజవరపు ఆంజనేయులు, కత్తుల సత్యనారాయణ, కుక్కల సుబ్బారావు, కుక్కల బాలచంద్రన్, గాది కంచి వరదరాజులు, మైలాబత్తుల మైకేల్‌రాజు తదితరులు ఉన్నారు.

ఉత్సవాలు ఐక్యతను చాటుతాయి

ఉత్సవాలు యువజనుల మధ్య ఐక్యతను చాటుతాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పట్టణంలోని ఎర్ర వంతెన వద్ద గల శ్రీ కృష్ణ ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన భారీ అన్నసమారాధనను గుడాల గోపి ప్రారంభించి భక్తులకు స్వయంగా ప్రసాదాలు వడ్డించారు. టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషబాబు, వైఎస్సార్ సీపీ చింతలపూడి, దెందులూరు పార్టీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, ఉత్సవ కమిటీ సభ్యులు మన్నె శ్రీనివాస్ (నాని), యియ్యపు భాస్కరరావు, ముగడ శ్రీనివాస్, దిండి వీరవెంకట సత్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం


పాలమూరులో దగ్ధమైన పూరిల్లు

పెనుమంట్ర: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం పాలమూరు అంబేద్కర్ కాలనీలో తాటాకిల్లు దగ్ధం కావడంతో రెండు కుటుంబాలకు చెందిన నలుగురు నిరాశ్రయులయ్యారు. వివరాల్లోకి వెళ్తే కూలి పనిచేసుకుంటూ జీవించే ఇంజే ఇజ్రాయిల్, ఇంజే నాగేశ్వరరావు, తన భార్య ప్రేమకుమారి, ఇద్దరు చిన్నారులు ఒకే తాటాకింటిలో రెండు పోర్షన్‌లో నివాసం ఉంటున్నారు. ఆదివారం యథావిధిగా కుటుంబ సభ్యులు చర్చికి వెళ్లారు. కొద్దిసేపటికే షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు పైకప్పు నుంచి మంటలు చెలరేగాయి. విషయం గమనించిన స్థానికులు మంటలను అదుపు చేశారు. అత్తిలి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని నష్టం అంచనా వేశారు. ముఖ్యంగా రూ.60 వేల నగదుతో పాటు గృహోపకరణాలు దగ్ధమయ్యాయి.

యజ్ఞాలతోనే లోక శాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): పురుణాల సమయం నుంచి రుషులు లోక శాంతి, లోక కల్యాణార్థం యజ్ఞాలు నిర్వహించే వారని, ప్రకృతి వైపరీత్యాలు, కరువు కాటకాలు, అనారోగ్య పరిస్థితులు పోవాలంటే యజ్ఞాలే శరణ్యమని భీమవరం శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం బిల్డర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గన్నాబత్తుల శ్రీనివాస్– ప్రమీలాదేవి దంపతులు ఆదివారం సుదర్శన లక్ష్మీనారాయణ స్వామి యజ్ఞం వైభవంగా గన్నాబత్తుల వారి వీధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వేద పండితులు బ్రహ్మశ్రీ సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా శ్రీ రమా సత్యనారాయణ స్వామి వారి వ్రతం 108 సార్లు, నెలకు ఒకసారి నిర్వహించి 108వ వ్రతాన్ని, దానితోపాటు సుదర్శన శ్రీ లక్ష్మీ నారాయణస్వామి యజ్ఞం ఘనంగా నిర్వహించామని తెలిపారు. కార్యక్రమ పర్యవేక్షకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ క్రతువుతో పాటు , చిన్నఅమిరం వృద్ధాశ్రమంలో వంద మందికి భోజనాలు, భీమవరం పట్టణంలోని అన్ని దేవాలయాల అర్చకులకు నూతన వస్త్రాలు, గన్నాబత్తుల వారి కుటుంబంలో దశాబ్దాల కాలంగా పని చేస్తున్న కార్మికులను కూడా నూతన వస్త్రాలతో సత్కరించి అన్న ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా వినాయకుడి ఆలయ ప్రతిష్ట


కార్యక్రమంలో మాట్లాడుతున్న టీటీడీ మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు

ఉండి: మండలంలోని పడవలరేవులో నూతనంగా నిర్మాణం చేసిన సిద్ధిబుద్ధి సమేత వినాయక స్వామి ఆలయాన్ని సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆదివారం ఉదయం ఘనంగా ప్రతిష్ఠ చేశారు. ఈ ప్రతిష్ఠా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర క్షత్రీయ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు,టీటీడీ మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధనా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉండి, ఎన్నార్పీ అగ్రహారం, వెలివర్రు, వాండ్రం, మహదేవపట్నం, పాములపర్రు తదితర గ్రామాల నుంచి భక్తులు పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ నాయకులు రణస్తుల వసంతరావు, బొబ్బాది శ్రీరామమూర్తి, గెద్దా రవికుమార్, రెడ్డి దుర్గారావు, పున్నాని మోహన్, అక్కాబత్తుల రామకృష్ణ, ఇజ్జాడ రామకృష్ణ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రణస్తుల మహంకాళి, సర్పంచ్ కమతం సౌజన్య, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, గులిపల్లి అచ్చారావు, బొచ్చా అచ్చారావు, గలావిల్లి ధనుంజయ, దాసరి వెంకటకృష్ణ,రాయి సతీష్, మునుకోలు సింహాచలం, మున్నలూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత ధ్యాన శిక్షణ

వీరవాసరం: స్థానిక శ్రీసీతారామస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత ధ్యానశిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తణుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ పి.మణికుమార్‌పాల్గొని జ్ఞాన బోధ చేశారు. ఈ సందర్భంగా పి.మణికుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్రహ్మర్షి పత్రీజీ ప్రబోధించిన శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం ప్రతిరోజూ చేయాలని, మాట మీద ధ్యాస ఉంచి మాట్లాడాలని, పిరమిడ్ జ్ఞాన రత్నాలు, రామాయణంలో పాత్రలు, బుద్ధుని అష్టాంగ మార్గం, సంకల్ప శక్తి గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్, హెచ్.చక్రపాణి, సన్నిధి ఉదయ్, కె.మోహన్, వర్రె కృష్ణవేణి, సబ్బారపు కమల తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి మందుబాబు హల్‌చల్

సాక్షి, భీమవరం: పట్టణంలోని బుధవారం మార్కెట్ కూడలిలో ఉన్న సెల్ టవర్‌ను ఆదివారం ఓ మందుబాబు ఎక్కి హల్‌చల్ చేశాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సెల్ టవర్ ఎక్కిన వ్యక్తిని కిందకు తీసుకువచ్చారు. టవర్ ఎక్కే సమయంలో చేతికి గాయం కావడంతో అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సెల్ టవర్ ఎక్కిన వ్యక్తి పట్టణానికి చెందిన బి.వసంతరావు అని, వివరాలు సేకరిస్తున్నామని సీఐ అడబాల శ్రీను తెలిపారు. ఇదిలా ఉండగా, మద్యం మత్తులో గతంలో అనేకసార్లు వసంతరావు సెల్ టవర్ ఎక్కాడని, దీనికి ప్రత్యేక కారణం ఏమీ లేదన్నారు.